క్లుప్తంగా

విశేషంగా సుదర్శన నారసింహ హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురి కాలనీ రామాలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం సుదర్శన నారసింహ హోమం విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేదికపై సుదర్శన పెరుమాళ్లను అధిష్టింపజేశారు. హోమం గుండం ఏర్పాటు చేసిన విష్వక్సేనపూజ, మండపారాధన, అగ్ని ప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకుడు హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విశేషంగా సీతారాముల తిరువీధి

సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను రథంపై అధిష్టింపజేసి గ్రామంలో తిరువీధి నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన సీతరాములను గ్రామస్తులు దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

శరగడం కుమారుడికి వైవీ సుబ్బారెడ్డి ఆశీసులు



డాక్టర్ భరత్‌కు శుభాకాంక్షలు అందిస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

పెందుర్తి: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ శరగడం చినఅప్పలనాయుడు కుమారుడు డాక్టర్ భరత్ వివాహం సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆశీసులు అందించారు. బుధవారం పెందుర్తిలోని శరగడం నివాసానికి చేరుకున్న సుబ్బారెడ్డి వరుడు డాక్టర్ భరత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. భరత్ వివాహం గురువారం జరగనుంది.

ఘనంగా టైలర్స్ డే



టైలర్స్‌డే కార్యక్రమంలో పాల్గొన్న టైలర్ల సంఘ సభ్యులు

పరవాడ: వాడచీపురుపల్లి దుర్గా భవానీ టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం తరపున పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కాకి ప్రసాద్, కూండ్రపు సన్యాసినాయుడు, పెదపూడి బ్రహ్మానందం, సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న పీఆర్వో అప్పలనాయుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని మధురవాడకు చెందిన దవళ వెంకట సూర్యనారాయణశర్మ దంపతులు లక్ష 116 రూపాయల విరాళం ఇచ్చారు. సింహగిరిపై దేవస్థానం తరపున దాతకు పీఆర్వో అప్పలనాయుడు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు.

1 నుంచి స్థూలకాయ నివారణ శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీ నుంచి మధుమేహం, వెన్నునొప్పి, స్థూలకాయ నివారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు. భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నేరుగా బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్‌లోని 99854 56150, 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.

వేడుకగా మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ట

- మార్మోగిన హరనామస్మరణ
- పాల్గొన్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



మల్లికార్జునస్వామి మూల విరాట్



గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: ఆ గ్రామంలో ఆధ్యాత్మిక భావం ఉప్పొంగింది. హర నామస్మరణ మార్మోగింది. ప్రతి ఇంటా భక్తి భావం కనిపించింది. సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని పెద నాయుడుపాలెం శివారు గణపతిపురంలో నూతనంగా నిర్మించిన శ్రీగణపతి భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట బుధవారం వైభవంగా నిర్వహించారు.వేదపండితులు మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు,అభిషేకాలు, హోమాలతో ప్రారంభోత్సవం చేశారు. స్వామివారి విగ్రహ ప్రతిష్టతో పాటు కలశ స్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గ్రామస్తులతో కలిసి భక్తిశ్రద్ధలతో క్రతువును నిర్వహించారు. వేద పండితులు రవితేజ శర్మ,జనార్దన్,సుధీర్ తదితరులు నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు,చుట్టు పక్కల గ్రామాలకు చెందిన మహాశివుని భక్తులు పాల్గొన్నారు.

మల్లికార్జునుడు చల్లగ చూడాలి

గణపతిపురంలో కొలువైన స్వయంభూ శ్రీగణపతి భ్రమరాంబిక మల్లికార్జునస్వామివారి ఆశీస్సులు,చల్లని చూపు గ్రాస్తులతో పాటు ఈ ప్రాంత వాసులపై ఉండాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఆకాంక్షించారు.చిన్న గ్రామంలో స్వామివారి ఆలయం నిర్మించడంతో పాటు ప్రతిష్టాపన మహోత్సవం కనుల పండువగా నిర్వహించడం గొప్పవిషయం అన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.1 లక్ష ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యదర్శి,వీకేపీ సీసీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్ రాజ్, ఎంపీపీ బోకం సూర్యకుమారి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ జెడ్పీటీసీ కోటాన రాము, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రిబాబు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,మండల లక్ష్మణ,బైలపూడి దేముడుబాబు,దెడ్డం ప్రసాదరావు,సబ్బవరపు సత్యనారాయణ,బోకం రామకృష్ణ,సబ్బవరపు సత్యనారాయణ,సబ్బవరపు నాగభూషణం పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీత ధారణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఘనంగా రాములోరి విగ్రహం ఊరేగింపు



ముస్తాబైన కోట్నివానిపాలెం రామాలయం



పూజలు చేస్తున్న గ్రామస్తులు

- కోట్నివానిపాలెంలో రామాలయ ప్రారంభోత్సవానికి శ్రీకారం
- మూడు రోజుల పాటు ప్రత్యేక హోమాలు, పూజలు

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రారంభోత్సవానికి అంతా సిద్ధమైంది. సంపత్ వినాయక పూర్వక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత కోదండ రామాలయ శిఖ యంత్ర విగ్రహాలు బుధవారం గ్రామానికి చేరుకున్నాయి. రాజమండ్రిలో ప్రత్యేకంగా రూపొందించిన ఆయా విగ్రహాలను డప్పులు, వాయిద్యాలు, కోలాటాలు, బాణసంచా నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం రాములవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కోదండ రామాలయం శిఖర యంత్ర త్రిరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9.49 గంటలకు విగ్రహ యంత్ర, శిఖర ప్రతిష్ట వేద మంత్రోచ్ఛరణలతో చేయనున్నారు. ఆరో మధ్యాహ్నం రామాలయం ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నారు. సాయంత్రం కోలాటాలు, గరిడీలు, మేళతాళాలు, తప్పెటగుళ్లు, మందుగుండు సామగ్రి నడుమ సీతారాముల పల్లకీ ఊరేగింపు చేస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

అప్రమత్తతోనే హెచ్‌ఐవీకి చెక్



ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పరవాడ: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ డిల్లీశ్వరి సూచించారు. విశాఖ జిల్లా ఎయిడ్స్ నియంత్ర సంస్థ ఆధ్వర్యంలో భద్రం ఫౌండేషన్ కళాజాత బృందం సభ్యులు బుధవారం పరవాడ బ్యాంకు కాలనీ వద్ద ఎయిడ్స్,హెచ్‌ఐవీ నియంత్రణపై నిర్వహించిన జానపద కళాజాత ఆకట్టుకుంది. ఈ వ్యాధులతో బాధపడుతున్న వారి పట్ల వివక్ష చూపకూడదని వివరించారు. కార్యక్రమంలో కోదండ, మోహన్, భాస్కర్, లతా, రత్నకుమారి, ప్రసాద్, భద్రం ఫౌండేషన్ కళాజాత బృందం కోఆర్డినేటర్ డేవిడ్ రాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ నమూనాలు



నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవో లక్ష్మణరావు తదితరులు



నృత్య ప్రదర్శనలో విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి అక్షర ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి ఎస్.లక్ష్మణరావు సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు.అక్షర విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనను తిలకించిన ఎంఈవో లక్ష్మణరావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పారావు,ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే అభివృద్ధి

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల ప్రయోగాలు, వైజ్ఞానిక, నృత్య ప్రదర్శనలు చేస్తూ సైన్స్ ఆవశ్యకతను విద్యార్థులు వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత దేశం అగ్రస్థితికి చేరడానికి సైన్స్ నుంచి పొందిన స్ఫూర్తి మాత్రమే నన్నారు.

అంతర్జాతీయ వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాల్లో కీలక పాత్ర పోషిస్తున్న రామన్ ఫలితం భారతీయుడు కనుగొనడం భారత జాతికి గర్వకారణమని కొనియాడారు. సైన్స్ ఉపాధ్యాయులు రూపాలి, రూపం, మొనాలిసా, రాజేష్, శంకర్, కోర్డినేటర్ రామలక్ష్మి పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

పరవాడ: పెన్షనర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మండల పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఆదిరెడ్డి సన్నిబాబు డిమాండ్ చేశారు. స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో సంఘ వ్యవస్థాపకులు బొండా అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పెన్షనర్ల సమావేశంలో సంఘ అధ్యక్షుడు సన్నిబాబు మాట్లాడారు. 2018 జూలై నుంచి రావాల్సి ఎరియర్స్‌ను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్‌సీ ప్రకటించే వరకు 30 శాతం ఐఆర్ ఇవ్వాలని కోరారు. గత పీఆర్‌సీలో మంజూరు చేసిన 70 ఏళ్ల వారికి 10 శాతం, 75 ఏళ్లు నిండిన వారికి 15 శాతం పునరుద్ధరించాలన్నారు. హెల్త్ కార్డులు ప్రైవేటు ఆస్పత్రుల్లో చెల్లుబాటు అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-1,సెక్షన్-2 పరిధిలోని సబ్బవరం,అంతకాపల్లి సబ్‌స్టేషన్ల ఫీడర్లలోని విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్. రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

సింహాచలం ఫీడర్ పరిధిలో ...

సింహాచలం: 11కేవీ సింహాచలం ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. దారపాలెం, పాత అడవివరం, చీతచెట్టు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రశాంతినగర్‌లో దొంగల హల్‌చల్

అపార్ట్‌మెంట్‌లో రూ.2 లక్షల నగదు అపహరణ



సీసీ కెమెరా పుటేజీలో రికార్డయిన దుండగుడి చిత్రం

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మరోసారి దొంగలు హల్‌చల్ చేశారు. ప్రశాంతినగర్ రాయల్ అపార్ట్‌మెంట్‌లో పట్టపగలు చోరీ జరిగింది. ఓ ఫ్లాట్‌లోకి దుండగుడు చొరబడి రూ.2 లక్షల నగదు, తులం పావు బంగారం, 15 తులాల వెండి అపహరించుకుపోయాడు. వివరాలివి..అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో నివాసం ఉంటున్న అరవింద్ పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. అతడు బుధవారం ఉదయం పనికి వెళ్లిపోగా..కుటుంబ సభ్యులు తలుపులకు తాళాలు వేయకుండా పక్కకు వెళారు. అదే సమయంలో చాకచక్యంగా ఫ్లాట్‌లోకి చొరబడి నగదు, బంగారం, వెండి తస్కరించాడు. ఆయా దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. నగర క్రైం విభాగం ఏడీసీపీ గంగాధరం, వెస్ట్ జోన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఘటనాస్థలిని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.40 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధి



శ్మశాన వాటిక పనులు పరిశీలిస్తున్న చందుయాదవ్

పెందుర్తి: పురుషోత్తపురం శ్మశాన వాటిక అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం రెండో విడత రూ.20 లక్షలు జీవీఎంసీ ద్వారా విడుదల చేసింది. ఆయా పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్ మాట్లాడుతూ తొలి విడత రూ.20 లక్షలు, రెండో విడత రూ.20 లక్షలను జీవీఎంసీ విడుదల చేసిందన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫార్మాసిటీలోని ఐరా అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సార్వత్రిక ఎన్నికల ప్రణాళికపై సబ్‌డివిజనల్ పరిధిలోని పోలీసుల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం తమ విధులను నిర్వర్తించాలని ఆదేశించారు. పలు సూచనలు సలహాలు అందించారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రమణ

సబ్బవరం: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని సీఐ రమణ కోరారు. గంగవరం గ్రామంలో ఎన్నికల నిబంధనలపై బుధవారం పోలీసులు అవగాహన కల్పించారు. సీఐ రమణ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

9 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ: మండలంలోని నునపర్తి గ్రామానికి చెందిన రెడ్డి రాజేష్ తన పాన్‌షాపులో మద్యం తీసుకెళ్తుండగా అరెస్ట్ చేసినట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు. అతడి నుంచి 9 మద్యం సీసాలు స్వా. దీనం చేసుకున్నట్టు చెప్పారు.

యువతిని బెదిరించిన యువకుడు

బీచ్‌రోడ్డు: తనతో రాకపోతే కత్తితో గొంతు కోసి చంపేస్తా.. లేదా కోసుకుని చచ్చిపోతా అని యువతిని బెదిరించిన యువకుడిపై యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రేసవానిపాలెంలో నివాసం ఉంటున్న సంధ్య, దుర్గాప్రసాదరావు దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమార్తె ప్రసన్న నగరంలోని ఒక ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదువుతోంది. గతంలో తనతో పాటు స్కూల్లో చదువుకున్న జి. కుమార్‌శంకర్, ప్రసన్న 2022లో ఇన్‌స్టాగామ్ ద్వారా కలుసుకున్నారు. గత నెల 22వ తేదీన ప్రసన్న, కుమార్‌శంకర్ కనిపించకుండా పోయారు. వారిని అతి కష్టం మీద కనిపెట్టి మూడో పట్టణ పోలీసులకు అప్పజెప్పారు. ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. అయితే మంగళవారం కుమార్ శంకర్ యువతి ఇంటికి వెళ్లి మెడపై కత్తి పెట్టి తనతో రావాలని లేకపోతే చచ్చిపోతా అని.. లేదా నిన్ను చంపేస్తా అని బెదిరించాడు. దీంతో పెద్దగా కేకలు వేయటంతో చుట్టుపక్కల వారు రావటంతో యువకుడు పరారయ్యాడు. ఆ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో అప్రెంటిస్ మేళా

మర్రిపాలెం: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సెంట్రలైజ్డ్ అప్రెంటిస్ మేళాను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు ఈ మేళా ఏర్పాటు చేశామన్నారు. బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్ ట్రైనింగ్ సదరన్ రీజియన్(చెన్నై) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా సాంకేతిక విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎ.వి.రామకృష్ణ, వికాస్ (స్వచ్ఛంద సంస్థ) ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు, ఆశా సొసైటీ అధ్యక్షుడు మస్తాన్‌వల్లి అతిథులుగా విచ్చేశారు. అప్రెంటిస్ శిక్షణ ప్రాముఖ్యాన్ని అతిథులు వివరించారు. 14 ప్రముఖ సంస్థల సిబ్బంది 175 మంది అప్రెంటిస్ ట్రైనింగ్ అభ్యర్థులకు ఇంటర్వ్యూ చేశారు. మేళా విజయవంతానికి కేబీఎస్ఎస్ కుమార్, కళాశాల సిబ్బంది సహకరించారు. కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్(బోట్) ఎస్ఆర్ చెన్నై అసిస్టెంట్ డైరెక్టర్ జి.ఎడ్వర్డ్ పాల్, హిందుస్థాన్ షిప్‌యార్డు మేనేజర్ డాక్టర్ సోమసుందరం, జీవీఎంసీ శిక్షణ - ఉపాధి అధికారి సిహెచ్.జయప్రకాష్‌రెడ్డి, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.వి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

విమ్స్‌లో అందుబాటులో అంకాలజీ వైద్య నిపుణులు



మహిళకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, విమ్స్ డైరెక్టర్ రాంబాబు

ఆరిలోవ: విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో అనుభవజ్ఞులైన అంకాలజీ వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. బుధవారం క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇక్కడ ఓపీ విభాగంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ శిబిరం కొనసాగింది. శిబిరానికి వచ్చిన రోగులకు అంకాలజీ వైద్య నిపుణులు క్యాన్సర్ పరీక్షలు చేసి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ శిబిరంలో 75 మంది వైద్య సేవలు వినియోగించుకున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, ఎముకలకు సంబంధించిన క్యాన్సర్, చర్మ క్యాన్సర్ పరీక్షలు చేసినట్లు తెలిపారు. వారిలో 8 మందికి ఎఫ్ఎన్ఏసీ పరీక్షలు, 12 మందికి మెమోగ్రాం పరీక్షలు కూడా చేసినట్లు తెలిపారు. ఇవి ఖరీదైన పరీక్షలన్నారు. విమ్స్‌లో ఇటీవల కొత్తగా క్యాన్సర్ విభాగం ప్రారంభించినట్లు తెలిపారు. మందుల ద్వారా క్యాన్సర్ నయం చేసే ఇద్దరు వైద్య నిపుణులు, కణితులకు సర్జరీ చేసే మరో ఇద్దరు వైద్యులు, సహాయక సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అగు శ్రీమతి బుద్ధా లక్ష్మి @ బొడ్డేటి లక్ష్మి, W/o. బొడ్డేటి హరి శ్రీనివాసరావు, డోర్ నెం. 17-100/2/1, బృందావన్ గార్డెన్, పెందుర్తి, విశాఖపట్నం, వారు ఇచ్చిన సమాచారం మేరకు ఈ ప్రకటన ఇవ్వడం జరిగినది, నా క్లయింట్ పెందుర్తి గ్రామం పట్టా నెంబర్. 2698, సర్వే నెంబర్ 140/3లో చేరిన 350 Sq.yds లేక 292.645 Sq.mts, విశాఖపట్నంలో గల ఖాళీ స్థలం ను శ్రీమతి సెశెట్టి ఈశ్వరమ్మ W/o సెశెట్టి వరహాలు గారి వద్ద నుంచి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొనుట వలన, పైన ఆస్తిపై ఎటువంటి అక్షేపణలు వున్న యెడల ఈ ప్రకటన తేదీ నుంచి వారము రోజుల లోపు తెలియజేయవలెను. లేని పక్షంలో ఈ ఆస్తిపై ఎటువంటి తగాదాలు లేవని నిర్ణయించుకొని నా క్లయింట్ తదుపరి కార్యక్రమం తీసుకోబడును అని యిందుమూలంగా తెలియజేయుచున్నాము.

స్థలమునకు హద్దులు : తూర్పు: శరగడం అప్పలనాయుడు గారు & ఇతరుల ఖాళీ స్థలం. **పడమర :** బొడ్డేటి లక్ష్మి గారు ఖాళీ స్థలం, **దక్షిణం :** గోల్డ్‌స్పాట్ కంపెనీ ఖాళీ స్థలం, **ఉత్తరం :** 10 అడుగుల రోడ్డు.

Damodara Appala Naidu, B.A., B.L.
Advocate & Notary
D.No. 8-53, Beside Rythu Bazar
Pendurthi, Visakhapatnam.
Cell: 98853 25688, 95021 04404

2న పుస్తకావిష్కరణ

సీతంపేట: ప్రొఫెసర్ కె.ఎస్.చలం రచించిన 'బౌద్ధ విజ్ఞానం, లౌకిక జీవనం' పుస్తకావిష్కరణ సభ మార్చి 2వ తేదీ శనివారం సాయంత్రం 5.30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరుగుతుందని అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మయన్మార్ (బర్మా)కు చెందిన భిక్షు రాజధమ్మ ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరిస్తాన్నారు. ఏయూ ఫిలాసఫీ విభాగాధిపతి వి.వెంకటరావు అధ్యక్షతన జరిగే సభలో కవులు, కళాకారులు, సాహిత్యాభిలాషులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కథలు మానవతా విలువలు పెంచాలి



మాట్లాడుతున్న ద్విభాష్యం రాజేశ్వరరావు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన కథా కచేరిలో ప్రముఖ రచయితలు చదివిన కథలు అందరినీ అలరించాయి. ముఖ్య అతిథి, కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు మాట్లాడుతూ కథానిక మానవతా విలువలను పెంచేదిగా ఉండాలన్నారు. వ్యక్తులకు సభ్యతా, సంస్కారం నేర్పేటట్టు ఉండాలని సూచించారు. సత్యాన్ని నిలబెట్టడం, ధర్మాన్ని ఆచరించమని కేవలం వాక్యంగా చెప్పడం కాకుండా కథలోని పాత్రలు, నడత ద్వారా ప్రతిబింబింప చేయాలన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథలు మానసిక ఉల్లాసంతోపాటు నైతికత పెంపొందించేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగవతుల సత్యనారాయణ, సిహెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరు రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, కె.జి.వేణు పాల్గొన్నారు.